## ‘సీఎం అల్పాహారం’

# పేద విద్యార్థులకు వరం





సీఎం అల్పాహారం బాగుందని చెబుతున్న విద్యార్థినులు

- జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- నెహ్రూనగర్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం ప్రారంభం
- హాజరైన కలెక్టర్ అనురాగ్‌జయంతి, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

నెహ్రూనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు అరుణ, కళ, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ఆర్‌బీఎస్ కన్వీనర్ గడ్డం నర్సయ్య, డీఈవో

తెలంగాణ చౌక్, అక్టోబర్ 6: నిరుపేద విద్యార్థులకు సీఎం అల్పాహార కార్యక్రమం గొప్ప వరమని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహారం కార్యక్రమాన్ని కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. ప్రతి నిరుపేద విద్యార్థికి ఉదయం పూట అల్పాహారం అందించాలనే లక్ష్యంతో సీఎం అల్పాహారం పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడుల్లో సకల సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. విద్యార్థులందరికీ ఉచితంగా నోట్‌బుక్‌లు, పాఠ్యపుస్తకాలు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందించడంతోపాటు సీఎం అల్పాహార కార్యక్రమాన్ని కూడా ప్రారంభించడం సంతోషకరమన్నారు. దసరా సెలవుల తర్వాత ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని రాబోయే పదో తరగతి పరీక్షల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపాలని ఆకాంక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని ప్రారంభించడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు ఇదివరకే మధ్యాహ్న భోజనం ద్వారా రుచికరమై ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్‌బీఎస్ జిల్లా కన్వీనర్ గడ్డం నర్సయ్య, అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, డీఈవో రమేశ్‌కుమార్, కౌన్సిలర్ రెడ్యానాయక్, హెచ్‌ఎం భాగ్యరేఖ, ఉపాధ్యాయుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు, పరమేశ్ పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు
- చీర్లవంచలో బతుకమ్మ చీరెల పంపిణీ




బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ రూరల్, అక్టోబర్ 6: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వేములవాడ మండలం చీర్లవంచలో మహిళలకు బతుకమ్మ చీరెలను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ, ఆడబిడ్డలకు బతుకమ్మ కానుకగా ప్రభుత్వం చీరెలను పంపిణీ చేస్తున్నదని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు పెద్దఎత్తున రుణాలను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, ఎమ్మెల్యేగా చల్మెడ లక్ష్మీనరసింహారావుకు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బూర వజ్రమ్మ, జడ్పీటీసీ మ్యాకల రవి, సర్పంచ్ రంగు సత్తమ్మ, ఎంపీటీసీ దేవరాజు, వైస్ ఎంపీపీ ఆర్‌సీరావు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# మూలవాగులో హైలెవల్ బ్రిడ్జిలకు ₹52కోట్లు

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు చొరవతో నిధులు మంజూరు

కోనరావుపేట, అక్టోబర్ 10: మూలవాగులో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ₹52కోట్లు మంజూరు చేసింది. మామిడిపల్లి, నిజామాబాద్ గ్రామాల మధ్యలో హైలెవల్ బ్రిడ్జికి ₹16కోట్లు, బావుసాయిపేట, వెంకట్రావుపేట బ్రిడ్జికి ₹12కోట్లు, వట్టిమల్ల, నిమ్మపల్లి గ్రామాల మధ్యలో హైలెవల్ బ్రిడ్జికి ₹14కోట్లు, కొండాపూర్ పెంటి వాగుపై హైలెవల్ బ్రిడ్జికి ₹10కోట్లు కేటాయించింది. దీంతో మామిడిపల్లిలో మూలవాగు వంతెన వద్ద, కొండాపూర్ గ్రామంలోని పెంటివాగు వద్ద సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు చిత్రపటాలకు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, సర్పంచ్ కొక్కుల భారత పాలాభిషేకం చేశారు. ఇక్కడ ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ గోగు ప్రతాపరెడ్డి, ఉపసర్పంచ్ రాంరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు జవ్వాజి మల్లయ్యగౌడ్, నేతలు వంగపల్లి శ్రీనివాస్, పూడూరి ప్రవీణ్, దేవయ్య ఉన్నారు.



కొండాపూర్ పెంటి వాగు వద్ద సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నేతలు

# అన్నం పెట్టే కేసీఆర్‌కు పట్టం కట్టండి

- పగటి వేషగాళ్లను తరిమి కొట్టండి
- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- 170 మందికి గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ



బోయినపల్లిలో గృహలక్ష్మి ప్రొసీడింగ్స్‌ను అందిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినపల్లి, అక్టోబర్ 6: సంక్రాంతికి ముందు గంగిరెద్దుల వాళ్ల లాగా వచ్చే పగటి వేషగాళ్లను నమ్మి మోసపోవద్దని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అన్నం పెట్టె కేసీఆర్‌కు మూడో సారి పట్టం కట్టాలని, మోసం చేసే కాంగ్రెస్, బీజేపీలకు చరమ గీతం పాడాలని కోరారు. వారి మాటలకు మోసపోతె మళ్లీ మనకు హరి గోస తప్పదని వాపోయారు. శుక్రవారం బోయినపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహలక్ష్మి పథకం కింద 170 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడు లేని వారెవరూ అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. వారందరికీ ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. తొలి విడతగా మంజూరు చేసిన గృహలక్ష్మి ఇండ్లతో పాటు మిగిలిన వారికి కూడా ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇండ్లు మంజూరైన వారు వెంటనే ఇంటి నిర్మాణం చేసుకునేందుకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు.



వెంకట్రావుపేట లబ్ధిదారులకు గృహలక్ష్మి ప్రొసీడింగ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీనరసింహారావు

# స్వరాష్ట్రంలోనే పేదలకు న్యాయం

- వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు
- లబ్ధిదారులకు గృహలక్ష్మి, బీసీబంధు ప్రొసీడింగ్స్ పంపిణీ

మేడిపల్లి, అక్టోబర్ 6 : స్వరాష్ట్రంలోనే నిరుపేదలకు న్యాయం జరిగిందని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. అన్నివర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు పెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. మేడిపల్లిలో శుక్రవారం ఆయన వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుతో కలిసి పర్యటించారు. లబ్ధిదారులకు గృహలక్ష్మి, బీసీ బంధు ప్రొసిడింగ్స్, బతుకమ్మ చీరెలు, కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు, టేకేదారులకు పింఛన్ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. కర్ణాటకలో అధికారం కోసం కాంగ్రెస్ ఇష్టమొచ్చిన హామీలు ఇచ్చి విస్మరించిందని విమర్శించారు. కానీ, కేసీఆర్ ప్రభుత్వం నేతన్నల కడుపునింపేదుకే ₹350 కోట్లతో బతుకమ్మ చీరెల ఆర్డర్లిచ్చిందని తెలిపారు. ప్రజలు గమనించి పనిచేసే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. గృహలక్ష్మి నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికీ ఇండ్ల నిర్మాణానికి సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ₹748 కోట్లతో కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పూర్తి చేసి మేడిపల్లి, కథలాపూర్ మండలాలను సస్యశ్యామలం చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు ₹10 కోట్లతో నిర్మించే 600 ఇండ్లకు ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ₹20 కోట్లతో మేడిపల్లి నుంచి గోవిందారం వరకు రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ₹2.50 కోట్లతో నిర్మించే కుల సంఘ భవనాలకు నిధులు, 50 మంది బీడీ టేకేదార్లకు పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. 25 గ్రామాల్లోని యువకులకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లనును అందజేశారు. మేడిపల్లి మండలానికి చెందిన ఐదుగురికి కల్యాణలక్ష్మి, ఒకరికి షాదీముబారక్ చెక్కులు అందజేశారు. పోరుమల్లలో గృహలక్ష్మి కింద నిర్మించే ఇల్లుకు కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ చేశారు. గుండ్లపల్లిలో ₹28 లక్షలతో నిర్మించిన జీపీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు, ఎంపీపీ దోనకంటి ఉమాదేవి, వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు వంగ వెంకటేశం, సర్పంచులు గడ్డం నారాయణరెడ్డి, ఈర్నాల సంపత్‌కుమార్, ద్యావనపెల్లి అభిలాష్ పాల్గొన్నారు.